# 4

# సార్వత్రిక సహోదరత్వం

*"ఇందుకు ప్రవక్తల వాక్యములు సరిపడియున్నవి; 'ఎట్లనగా – … మనుష్యులలో కడమవారును నా నామము ఎవరికి పెట్టబడెనో ఆ సమస్తమైన అన్యజనులును* ***ప్రభువును*** *వెదకునట్లు' … అనాదికాలమునుండి ఈ సంగతులను తెలియపరచిన* ***ప్రభువు*** *సెలవిచ్చుచున్నాడు" (అపొ. 15:15–18).*

బహిరంగమైన స్థలములో ఎనిమిది ఏండ్ల ప్రాయముగల యిద్దరు బాలురు కొట్టుకుంటున్నారు. ఇరకాటపడిన యిద్దరు తల్లులు వారిని వేరుగా లాగి, ఏమి జరిగిందో అడిగారు: "సరే ఈ తగవు ఎవరు మొదలుపెట్టారు?" అనే ప్రశ్నకు, తడబడుతున్న మాటలతో, "వాడు నన్ను తిరిగి కొట్టినప్పుడు యిదంతా ప్రారంభమయ్యింది!" అని ఆ పిల్లలలో ఒకడన్నాడు. అది ఎనిమిదేండ్ల పిల్లవాడి మాటలాగే ఉంది, కదా?

ఏదియెలాగున్నా, ఒక సంఘర్షణను ఎవడు ప్రారంభించాడనేది కాదు, కాని ఏ విధమైన స్థిర స్వరాల సూచనలు లేకుండ అది పరిష్కరింపబడుతుందా లేదా అనేది అసలు విషయమౌతుంది. మనకు తెలిసిందంతా, ఒక సంఘర్షణ సరిగా పరిష్కరించకపోయినా, లేక దాన్ని అలక్ష్యం చేసినా, స్నేహితుల మధ్య ఆ కలహం కొనసాగుతూనే ఉంటుంది.

అపొస్తుల కార్యములు 15 ప్రకారం, ఉపదేశంలోని అభిప్రాయ భేదం ఆది సంఘంలో సమస్యగా మారింది. కొందరు యూదయనుండి వచ్చి – మోషే నియమించిన ఆచారము చొప్పున సున్నతి పొందితేనే గాని ఒకడు నిజమైన క్రైస్తవుడై ఉండడానికి వీలులేదు, మరియు రక్షింపబడడానికి అవకాశం లేదని అన్యజనులలోనుండి వచ్చినవారికి ఉపదేశిస్తున్నారు (1 వ.). యూదయనుండి వచ్చిన ఈ ఉపదేశకులు అన్యజనుల విషయంలో రక్షణ సంకల్పానికి సున్నతి అనేదాన్ని చేర్చారు. క్రైస్తవ్యాన్ని గూర్చిన వారి ఆలోచన, పరిశుద్ధాత్మ ప్రేరేపితులైయున్న పౌలు, బర్నబా అనేవారి పరిచర్యకు పూర్తి వ్యతిరేకంగా ఉంది. అందునుబట్టి, పౌలుకును బర్నబాకును వారితో విశేష వివాదమును తర్కమును కలిగింది (2 వ.).

ఉపదేశంలోని అసమ్మతి పరిష్కరింపబడలేదు. గనుక అక్కడ విభజన ఏర్పడింది.

దానిని అలాగే విడిచిపెట్టియుంటే, క్రైస్తవ్యం యొక్క భవిష్యత్తు దెబ్బతీసేదే. అలాటి క్లిష్ట పరిస్థితి అంతియొకయ సంఘాన్ని భయపెట్టినట్టుంది. అందువలన యెరూషలేములోని అపొస్తులులు, పెద్దల వద్ద సిద్ధాంత సంబంధమైన ఈ విషయాన్ని గూర్చిన నిజాన్ని నిర్ధారణ చేయడానికిగాను అంతియొకయనుండి పౌలు, బర్నబా మరి కొందరు సహోదరులను సంఘం పంపుతుంది.

పౌలు, దైవ ప్రేరేపితుడైన అపొస్తలుడుగా, అన్యజనుల రక్షణ కొరకైన దైవ సత్యాన్ని పొందినవాడై, దాన్ని ప్రకటిస్తున్నాడు. ఏదియెలాగున్నా, సంఘము యొక్క ఐక్యత కొరకు అతడు యెరూషలేము వెళ్లడానికిని, ఈ విషయమై దేవుడు ఏమి బయలుపరచాడో దైవ ప్రేరేపితులైన మనుష్యులను చేర్చి తేల్చుకోడానికి బయలుదేరాడు. యెరూషలేములో ప్రత్యేకమైన జనుల కూడిక ఏర్పాటు చేయబడింది. అక్కడ అపొస్తులులచేతను సంఘ పెద్దలచేతను ఈ ప్రశ్న విషయం చర్చించబడింది.

ఆ మీటింగులో, పేతురు లేచి నిలిచి యూదులకును అన్యజనులకును దేవుడు ఏ భేదము చేయలేదని స్థాపించాడు. కొర్నేలీ యింటివారిపై అద్భుతరీతిగా కుమ్మరింపబడిన ఆత్మ (అపొ. 10:44-48), యూదులు ఎలా రక్షింపబడతారో అన్యజనులు కూడా అలాగే రక్షింపబడతారన్న విషయాన్ని పేతురు బోధించాడు (అపొ. 15:7-11). యూదులకు ప్రకటింపబడినట్టుగానే అన్యజనులకు కూడా తమ పరిచర్య మూలముగా సువార్త ప్రకటింపబడుతున్న విషయాన్ని పౌలు బర్నబాలు కూడా వివరించారు (అపొ. 15:12). మాట్లాడబడిన వాటి సారాంశాన్ని చెప్పి యాకోబు ముగింపుకు తెస్తాడు. ఈ ప్రశ్న విషయంలో ఆయా దైవ ప్రేరేపితులగు మనుష్యులకు బయలుపరచబడిన దాన్ని క్రోడీకరించి అతడు తన అభిప్రాయాన్ని తెలుపుతాడు (అపొ. 15:13-21). అతని ఆలోచన ఏమంటే: యూదులకు ఎలాగో అన్యజనులకుకూడా దేవుని రాజ్యములో ప్రవేశించడానికిని, వారిరువురు ఒకే ఏర్పాటు ద్వారా రక్షింపబడడానికిని దేవుడు ద్వారం తెరిచాడు.

సంఘము యొక్క సార్వత్రిక సహోదరత్వాన్ని గూర్చి అతడు రుజువు చేస్తూ, దేవుడు అన్యజనులను తోడుకొని రావాలనే ఉద్దేశానికి సంబంధించిన ఆమోసు 9:11, 12ను అతడు కోట్ చేస్తాడు:

> ఇందుకు ప్రవక్తల వాక్యములు సరిపడియున్నవి; ఎట్లనగా ఆ తరువాత నేను తిరిగి వచ్చెదను; మనుష్యులలో కడమవారును నా నామము ఎవరికి పెట్టబడెనో ఆ సమస్తమైన అన్యజనులును ప్రభువును వెదకునట్లు పడిపోయిన దావీదు గుడారమును తిరిగి కట్టెదను దాని పాడైనవాటిని తిరిగి కట్టి దానిని నిలువబెట్టెదనని అనాది కాలమునుండి ఈ సంగతులను తెలియపరచిన ప్రభువు సెలవిచ్చుచున్నాడని వ్రాయబడి యున్నది (అపొ. 15:15-18).

వారి యెదుట పేతురుచే పలుకబడిన మాటలు పాత నిబంధన ప్రవక్తలతో ఏకీభ విస్తున్నాయని యాకోబు తెలియజేసి, అన్యజనులను ప్రస్తావించిన, ఆమోసు యొక్క ఈ ప్రవచనాన్ని అతడు కోట్ చేసాడు. సంఘం స్థాపింపబడిన పెంతెకొస్తనే చారిత్రక దినాన, పరిశుద్ధాత్మ కుమ్మరింపును సూచిస్తూ, "యోవేలు ప్రవక్త ద్వారా పలుకబడిన సంగతి

యిదే”నని పేతురు తెలియజేశాడు (అపొ. 2:16). “ఇందుకు ప్రవక్తల వాక్యములు సరిపడియున్నవి” అని యాకోబు సూచించాడు (అపొ. 15:15). దైవ ప్రేరేపితుడైన వాడు ఒక సంభవాన్ని చూచినప్పుడు, పరిస్థితి, తనకు ముందు జరుగుతున్న పని, పాత నిబంధన వైపుకు చూపుతూ, “ప్రవక్తలు ముందుగా చెప్పిన సంగతి యిదే, ఆ ప్రవచనం యొక్క నెరవేర్పును తప్పులేకుండ గ్రహించగలుగుతున్నామని” చెప్పుతాడు.

ఆమోసు ప్రవచనం సంఘము యొక్క సార్వత్రిక సహోదరత్వాన్ని ముందుగా చూపుతుంది. యూదులును అన్యజనులును క్రీస్తు శరీరములోనికి ప్రవేశించి, కలుషితము కాని సమాధాన సంబంధమైన ఐక్యతతో నివసిస్తారని అది చిత్రిస్తుంది. పేతురు కొర్నేలీ యింటివారికి ప్రసంగించుచుండగను, మరియు పౌలు అన్యజనులకు బోధించుచుండగను ఈ ప్రవచనం వాస్తవమైపోయింది. దేవుని కుటుంబమనే రాజ్యంలోనికి అన్యజనులు వస్తూనే ఉన్నారు. యూదులు, అన్యజనులనే రెండు జనాంగములు, సంఘమనే ఒకే ఆత్మసంబంధమైన ఒక్క జనాంగమౌతారు. అన్యజనులు యూదులుగా చేయబడడం లేదు. లేక యూదులు అన్యజనులుగా కూడా చేయబడడం లేదు; కాని యూదులు అన్యజనులు కూడ, క్రైస్తవులనబడే “దేవుని పరిశుద్ధయాజకులై” యుంటారు (1 పేతురు 2:5). విధేయతతో కూడిన విశ్వాసము ద్వారా – యూదులు అన్యజనులు కూడా ఏకముగా దేవుని పిల్లలౌతారు. కృపచేత రక్షింపబడినవారి మధ్య ఏ విధమైన అంతస్థులు గుర్తించ బడవు. వాని దేశము, వయస్సు, లేక నాగరికత ఎలాటిదైనా సరే, ఏ ఒక్కడును మరియొకనికంటె అధికుడు కాడు; ఎవడును మరియొకని కంటె తక్కువవాడు కాడు.

క్రైస్తవ సహవాస పరిధులను సూచించే ప్రవచనపు నెరవేర్పులయందు దాగియున్న భావాలను ఆలోచన చేద్దాం. ఐక్యత యొక్క స్వభావ లక్షణాలేవి? అది ఎంత అర్థసహితంగా ఉంటుంది? అది ఎంతటిని చుట్టివస్తుంది?

## పాపమంతటికి కిందగా

మొదటిగా సంఘ సహోదరత్వం యొక్క శక్తిని, లోతును చూద్దాం. పాపమంతటికి క్రీస్తు ప్రభువు యొక్క ప్రశస్తమైన రక్తం చేరుతుంది గనుక, దానిని బట్టియే ఈ ఐక్యత రాగలుగుతుంది. దేవుని కృపకు అతని జీవితాన్ని తెరచినట్లయితే, ఏ పాపియు దాని చేరువను దాటనివాడైయుండడు.

ఇలా సమాధానపరచబడడమనేది క్రీస్తు రక్తంవలన కలిగినందున, ఆ రక్తము యొక్క శక్తితో పొందికగల లోతును అది కలిగియుంది. ఏ పాపమైనా దాని స్వభావం ఎలాటిదైనా మరియు పాపముల సంఖ్య ఎంతైనా సరే, ఆయన రక్తము వాటిని సంపూర్ణం గాను శాశ్వతంగాను శుద్ధీకరించగలదు. అందువలన, ఈ సహవాసమునుండి మనలను అడ్డుకునే ఒకే ఆటంకం మారుమనస్సు లేకపోవడం. శుద్ధీకరించు ఊటను గూర్చి అతడు ప్రవచించి నప్పుడు, క్రీస్తు రక్తము యొక్క శుద్ధీకరణ శక్తిని గూర్చి జెకర్యా యిలా సూచించాడు, “ఆ దినమున పాపమును అపవిత్రతను పరిహరించుటకై దావీదు సంతతివారి కొరకును, యెరూషలేము నివాసుల కొరకును ఊట యొకటి తియ్యబడును”

(జెకర్యా 13:1).

జారులైనను, విగ్రహారాధకులైనను, వ్యభిచారులైనను, ఆడంగితనముగలవారైనను, పురుషసంయోగులైనను, దొంగలైనను, లోభులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను, దోచుకొనువారైనను దేవుని రాజ్యానికి వారసులు కానివారిని పౌలు ప్రస్తావించిన తరువాత, కొరింథీయులను అతడు యిలా ప్రోత్సహించుతున్నాడు – "మీలో కొందరు అట్టివారై యుంటిరి గాని, ప్రభువైన యేసు క్రీస్తు నామమునను మన దేవుని **ఆత్మ**యందును మీరు కడుగబడి, పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి" (1 కొరింథీ. 6:9–11). ఈ వచనం ఆశ్చర్యకరమైన సత్యాన్ని కలిగియుంది, సువార్త యొక్క గొప్ప సత్యం: పాపులు క్రీస్తు వద్దకు వచ్చినప్పుడు, వారు కడుగబడతారు (శుద్ధీకరింపబడతారు) నీతిమంతులుగా తీర్చబడతారు (దోషారోపణనుండి విడుదల చేయబడతారు)!

పౌలు జాబితాను మరోసారి తిలకించి, ఈ పాపములను ప్రత్యేకంగా గమనించు. అవి ఎంతటి నీచంగా ఉన్నా, సంఘం యొక్క సహవాసంలోనుండి కొరింథీయులను దూరపరచలేదు. విధేయతతో కూడిన విశ్వాసంతో వారు దేవుని వద్దకు వచ్చినప్పుడు, తన కుమారుని రక్తంచేత వాటినుండి వారిని శుద్ధీకరించి, నీతిమంతులనుగా తీర్చి, ఆ శరీరంలో ఉన్నవారందరితో సమానులనుగా క్రీస్తు శరీరములోనికి వారిని తెచ్చాడు. కొన్ని పాపములు తక్కిన వాటికంటె ఎక్కువైన ప్రభావం కలిగి ఉంటాయనేది సత్యమే, కాని నిజమైన మారుమనస్సుతో దేవునికి విధేయత చూపినప్పుడు, ఎలాటిదైనా మరియు పాపాలు ఎన్నైనా క్షమింపబడతాయి.

వ్యభిచారి మరెన్నడు వ్యభిచారికాని, దొంగమరెన్నడు దొంగకాని సమయం ఉంది. "ఎప్పుడు?" అని నీవు అడుగవచ్చు. అది దేవుని క్షమాపణయందు జరుగుతుంది. పౌలు యిలా వ్రాశాడు: "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి, పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ. 5:17). సువార్త యొక్క క్రీస్తు అంత మహిమాయుక్తమైనవాడు. ఆయనకు మనం విధేయులమైతే, మన గత పాప జీవితాలను తొలగించి, నూతన జీవితాన్ని ధరింపజేస్తాడు. మరియు పరలోక సంబంధమైన ఆశీర్వాదముల పరిధిలోనికిని, దైవికమైన సహవాస బాంధవ్యంలోనికిని మనలను తెస్తాడు.

క్రీస్తునందు నూతన వ్యక్తిగా మారడం కంటె గొప్ప విషయం మరేదీ లేదు. ఒక వ్యక్తి ఎక్కడుండేవాడు, ఏం చేశాడు, ఏం చెప్పాడు, ఏం ఆలోచించాడు అనే విషయాలన్నింటిని లెక్కపెట్టక దేవుడు వానిని బలి కావింపబడ్డ క్రీస్తను గొఱ్ఱె రక్తంతో కడుగుతాడు. క్రీస్తు రూపానికి ప్రతిరూపంగా తయారు చేయుటను ఆరంభిస్తాడు. అతనికి క్రీస్తుయందొక కొత్త జీవితాన్నిస్తాడు. ఇలా "మరల ఆరంభించడానికి" గల ఒకే ఒక్క అధికారిక స్థలం యేసుక్రీస్తులోనే ఉంది.

సంఘ జీవితం యొక్క లోతును మననం చేసికొందాం. స్త్రీయైనా, పురుషుడైనా, సువార్తకు లోబడడం ద్వారా క్రీస్తు వద్దకు వచ్చి, ఆయన రక్తంలో కడుగబడినప్పుడు, క్రీస్తులో నమ్మకంగలవారికందరికి సహోదరి లేక సహోదరులౌతారు. ఒకడు కడుగ బడినప్పుడు, ఏ కళంకము మిగిలియుండదు; దేవుని కృపవలన సంపూర్ణమైన శుద్ధీకరణ జరుగుతుంది. క్రీస్తు యొక్క శరీరంలో ఎవడును సగం ప్రవేశం పొందలేడు. అతడు

క్రీస్తులో ఉండైనా ఉండాలి లేక లేకనైనా ఉండాలి. ఎవడును పాక్షికమైన సహవాసము కలిగియుండలేడు, ఐదవ భాగం శుద్ధీకరణ పొందడు, లేదా క్రీస్తులోనికి కొంత భాగంగా తేబడడు. అంచలవారీగా ఎవడును రక్షింపబడడు. అతడు అంచలవారీగా బోధింపబడ వచ్చునుగాని, అతడు క్రీస్తులోనికి ఒక అంచగానే – క్రీస్తులోనికి తన బాప్తిస్మం వద్ద ప్రవేశిస్తాడు (గలతీ. 3:27). ఒక వ్యక్తి క్రీస్తులోనికి సంపూర్ణంగా ప్రవేశిస్తాడు మరియు క్రీస్తు రాజ్యములోనికి తక్కిన సభ్యులందరితో పాటు పూర్తిగా రక్షింపబడి, సంపూర్ణంగా నీతిమంతుడుగా తీర్చబడి అదే స్థితిలో నిలిచియుంటాడు. అందువలన, క్రైస్తవులలో ప్రతి ఒక్కరిని, మరియొకడు సమానునిగా చూస్తూ, దేవుని కుటుంబములోని సోదర సోదరీమణులుగా చూడబడాలి.

## జనులందరికి తెలిసినదిగా

తదుపరి, మనం, సంఘముయొక్క అద్భుతమైన వైశాల్యాన్ని చూస్తాం. అంతర్గత శక్తిలో, దేవుని కుటుంబం మానవ కుటుంబమంత విశాలమైనది. జాతినిబట్టిగాని, గత చరిత్రను బట్టిగాని లేక నాగరికతను బట్టిగాని ఈ కుటుంబంలోనికి ప్రవేశించడానికి ఎవరికి ఆటంకముండదు. అపో. 15:16–18లో, యూదులకును అన్యజనులకును రక్షణను ప్రసాదించే దేవుని సంకల్పాన్ని ప్రవచనములో చూపి, అపొస్తలుల ప్రకటనలో అది నెరవేర్చబడినట్టు రుజువు చేయడానికి యాకోబు ఆమోసు 9:10, 11ను ఎత్తిచూపాడు.

ప్రాథమికంగా, క్రొత్త నిబంధన ప్రపంచంలో: యూదులు, అన్యజనులనే రెండు వర్గాలే ఉండేవి. ఒకడు యూదుడు కాకపోయినట్లయితే, అతడు అన్యజనుడైయుండేవాడు. అందువలన, దేవుని రాజ్యంలోనికి యూదులకు అన్యజనులకు దేవుడు ద్వారం ఎలా తెరిచాడో రుజువు చేయబడినప్పుడు, లోకమంతటికి, సకల జనములకు ఆయన రాజ్యంలో ప్రవేశించే అవకాశాన్ని దేవుడు కల్పించాడన్న విషయం వాస్తవంగా రుజువు చేయబడింది.

పేతురుద్వారా పరిశుద్ధాత్మ పెంతెకొస్తు దినాన రక్షణ మార్గము బయలుపరచగా, ఒకనాటికి సకల జనములకు సువార్త అందింపబడుతుందని ఆయన సూచించాడు. ఆత్మ అతన్ని నడిపించిన సంగతి యావత్తు అతడు పూర్తిగా గ్రహించలేకపోయినా, ఆనాడు యిది జరిగింది. "ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులందరికిని, అనగా **ప్రభువైన** మన దేవుడు తనయొద్దకు పిలిచిన వారికందరికిని చెందుతుందని వారితో చెప్పెను" (అపో. 2:39). "దూరస్థులందరికిని" అనే పద ప్రయోగము – నిస్సందేహంగా అన్యజనుల లోకాన్ని సూచిస్తుంది. ఏదియెలాగున్నా, తరువాత పేతురు కొర్నేలీ యింటికి వెళ్లి అన్యజనులకు సువార్త ప్రకటించడానికి ముందు దేవుడు పేతురుకు అయిదు విధాల మార్గదర్శకం యివ్వవలసి వచ్చింది: (1) ఆయన కొర్నేలీకి దర్శనం యిచ్చాడు (అపో. 10:3–6); (2) అయన పేతురుకు దర్శనమిచ్చాడు (అపో. 10:9–16); (3) తన్ను తోడుకొని వెళ్లడానికి వచ్చినవారితో వెళ్లుమని ఆత్మద్వారా ఆయన అతనికి బోధింపవలసి వచ్చింది (అపో. 10:19, 20); (4) తాను పొందిన దర్శనాన్ని గూర్చి కొర్నేలీ పేతురుకు

తెలియజేశాడు (అపొ. 10:30-35); మరియు (5) పెంతెకొస్తు రోజున అపొస్తలుల మీదికి ఆయన పరిశుద్ధాత్మను కుమ్మరించినట్టే, కొర్నేలీ యింటివారి మీదను ఆయన పరిశుద్ధాత్మను కుమ్మరించాడు (అపొ. 10:44, 45). కొర్నేలీ యింటివారి మీద పరిశుద్ధాత్మ కుమ్మరింపబడడం అనే సూచనచేత పేతురు తీర్మానించుకునే పరిస్థితికి వచ్చాడు. అతని ప్రత్యుత్తరం అనుకూలమైనదనే తీర్మానంతో కూడింది:

> "-మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్లకు ఆటంకము చేయగలడా అని" చెప్పాడు (అపొ. 10:47).

యూదులు ఏ షరత్తుల మీద రక్షింపబడతారో, అదే షరత్తుతల మీద అన్యజనులు కూడా రక్షింపబడే అవకాశం అనుగ్రహింపబడిన దినం వచ్చినట్టు పేతురుకు స్పష్టంగా తెలిసిపోయింది.

యేసును సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు అని పేతురు ఒప్పుకొన్న దినాన, ప్రభువైన యేసు అతనికి యిలా వాగ్దానం చేశాడు: "పరలోకరాజ్యముయొక్క తాళపుచెవులు నీకిచ్చెదను: నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని చెప్పెను" (మత్తయి 16:19). ఆ వాగ్దానాన్ని నిలబెడుతూ, రాజ్యంలోనికి ప్రవేశించే షరత్తులను యూదులకు ప్రకటించే భాగ్యము పెంతెకొస్తు దినాన పేతురుకు యివ్వబడింది (అపొ. 2:37-39), మరియు కొర్నేలీకిని అతని యింటివారికిని రక్షణ మార్గాన్ని ప్రకటించే అదే భాగ్యము అతనికివ్వబడింది (అపొ. 10:34-43).

నా బైబిలు తరగతుల్లో నేను అపొస్తలుల కార్యాలు 10కి వచ్చినప్పుడు, యూదుల దేశానికి చెందినవారు క్లాసులో ఎవరైనా ఉన్నారా? అని అడుగుతాను. సాధారణంగా, ఎవరూ చేతులెత్తరు. అపొ. 10కి మనం కృతజ్ఞత గలవారమైయుండాలి, ఎందుకంటె యూదులవలె అన్యజనులమైన మనం కూడా సువార్త షరత్తులకు లోబడడం ద్వారా రక్షింపబడే హక్కు మనకు యివ్వబడినట్టు ఆ అధ్యాయం చెప్తుతోంది. అపొ. 10ని బట్టి మనం దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించడానికి ఏకమౌదాం!

సంఘ సభ్యత్వం యొక్క అద్భుతమైన వైశాల్యము ఎంతో అలోచించు. లోకములోని దేశములను, జనములను చూడు. వివిధములైన భాషలు, ఆచారములు మరియు నాగరికతలను గూర్చి ఆలోచించు. భూమిమీదనున్న ప్రజలందరు ఎక్కడ నివసిస్తున్నది, ఏమి చేస్తున్నది అనే దాన్ని ఊహించు. యువకులను బలవంతులను ముసలివారిని కురూపులను చిత్రించుకో; స్త్రీలను కన్యకలను, వివాహితులైన యువతులను, మధ్య వయస్కులను, ముసలివారిని చిత్రించుకో; సువార్త అందరికి, అన్ని దేశాలవారికి, అన్ని జాతులకు, అన్ని గోత్రాలవారికి, అన్ని కుటుంబాలకు, బాధ్యులైన వయస్సుగలవారందరికి యివ్వబడినందున దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించు, ఎవరును మినహాయించబడలేదు. "ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసు క్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు" (గలతీ. 3:28).

## ఆత్మసంబంధమైన ఆశీర్వాదములన్నిటి మట్టుకు

మూడవదిగా, సంఘ సహోదరత్వం యొక్క పరలోక సంబంధమైన ఎత్తును మనం చూస్తాం. క్రీస్తు రక్తము పైకి చేరగల శక్తినిబట్టి, పరలోక సంబంధమైన మహదైశ్వర్యమును అనుభవించడానికి క్రైస్తవులకు ద్వారం తెరువబడింది. సంఘము అని పిలువబడే క్రైస్తవ జనాంగంలో ఏ కొందరో తక్కినవారికంటె ఎక్కువగా దీవించబడినవారు కారు. దేవుని రాజ్యము సమానమైన అవకాశము గలిగిన చోటు. రాజులైన యాజక సమూహములో ద్వితీయ స్థానపు పౌరులుగాని, తక్కువైన యాజకులుగాని ఉండరు. ఒకడు క్రీస్తులోనికి వచ్చుటకు నిరాకరించి నశించిపోవచ్చును (ఎఫెసీ. 2:11, 12); ఒకడు క్రీస్తులో ఉండియు ఆయనకు అపనమ్మకస్థుడై నశించిపోవచ్చు (2 పేతురు 2:21, 22); కాని క్రీస్తులోనికి ప్రవేశించి క్రీస్తునందు నమ్మకంగా ఉండే ఎవడైనా మనం అతన్ని గురించి చెప్పే విషయాలన్నింటిని కలిగి ఉంటాడు . మరియు “పౌలైనను అపొల్లోయైనను, కేఫాయైనను, లోకమైనను, జీవమైనను, మరణమైనను, ప్రస్తుతము ఉన్నవియైనను రాబోవునవియైనను సమస్తమును మీవే. మీరు క్రీస్తువారు; క్రీస్తు దేవుని వాడు” అని ఆ వ్యక్తిని గూర్చి చెప్పవచ్చు (1 కొరింథీ. 3:22, 23).

---

**దేవుని కుటుంబములో సోదర సోదరీమణులుగా ఒకరితో నొకరు సమానులుగాను క్రైస్తవులుగాను క్రైస్తవులు ఒకరి నొకరు గుర్తించాలి.**

---

“మన ప్రభువైన యేసు క్రీస్తుయొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోకవిషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను” (ఎఫెసీ. 1:3) అని పౌలు పలికిన ఆశీర్వచనాన్ని ఏ క్రైస్తవుడైనా వ్యక్తిగతంగా వర్తింపజేసికోవచ్చు. క్రీస్తునందు మనమును “సంపూర్ణులమైయున్నా”మని పౌలుతో చెప్పవచ్చు (కొలస్సీ. 2:10). “మరియు అన్నిటియందును ఎల్లప్పుడును మీలో మీరు సర్వసమృద్ధిగలవారై ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీయెడల సమస్త విధములైన కృపను విస్తరింపచేయగలడు” ( 2 కొరింథీ. 9:8) అని క్రీస్తునందున్న వారిని గూర్చి చెప్పవచ్చు.

“తన మహిమనుబట్టియు, గుణాతిశయమునుబట్టియు, మనలను పిలిచినవాని గూర్చిన అనుభవజ్ఞానమూలముగా ఆయన దైవ శక్తి, జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయు”చున్నాడు (2 పేతురు 1:3). “విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి” మనము దేవుని సన్నిధానమునకు చేరగలం (హెబ్రీ. 10:22), ఎందుకంటే, క్రీస్తుద్వారానే మనము “ఒక్క ఆత్మయందు తండ్రి సన్నిధికి చేరగలిగి యున్నాము” (ఎఫెసీ. 2:18). “నిశ్చలమును, స్థిరమునైన” నిరీక్షణ మనకున్నది (హెబ్రీ. 6:19). మనము యేసుని వారలము, మరియు ప్రభువైన యేసు – తన కృపా మహిమలతో కూడా – మనవాడైయున్నాడు. క్రీస్తు ఎక్కడ ఉన్నాడో మనం అక్కడ ఉన్నాము, క్రీస్తు

కలిగియున్నదేదో అది మనదే, ఎందుకంటే మనము క్రీస్తు తోటి వారసులమైయున్నాం (రోమా 8:17).

ఇది ఒక విధంగా ఒక దేశం యొక్క రాష్ట్రపతి లేక ప్రధాన మంత్రిని పోలియుంది. నీ యెడల ఆ దేశానికిగల ప్రాధాన్యతనుబట్టి, అతి శ్రేష్ఠమైన భోజనమును, చక్కగా తగిన వస్త్రాలను, నీ కాపుదలకు అంగరక్షకుడును, నీ నివాసానికి ఒక రాజ భవనమును లభిస్తాయి. ఆ దేశము యొక్క మూలాధారాలు ఒక విధంగా నీ ఆజ్ఞా అదుపులో ఉంటాయి. నీవు నివసించే పట్టణానికి కాపుదల అవసరమైతే దాన్ని కాపాడడానికి గాను సైన్యమంతటిని పిలువవచ్చు. ఒక సాధారణమైన పౌరునికి లేని సదుపాయాలకు భోగభాగ్యాలకు నీ అంతస్థును బట్టి అధికారపూర్వకమైన ప్రవేశం నీకు లభిస్తుంది.

అలాగే, దేవుని కుమారునికి చెందిన మూల నిధులకు, ఐశ్వర్యానికి హక్కులకు క్రీస్తునందు మనకు ప్రవేశముంటుంది. క్రీస్తునందు మనం జీవిస్తుంటే, దేవుడు తన కుమారులకు ప్రసాదించేవన్నీ మనకు అందుబాటులో ఉన్నాయి.

ధన్యతకు అవకాశం కలిగియుండుట ఒక వంతు, ఆ అవకాశాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసికొనడం మరొక వంతు అనుకో. రాజ్యములో ఉన్నందువలన వచ్చే లాభాలకు క్రీస్తునందు మనకు సంపూర్ణ ప్రవేశముంటుంది. అయితే (అశ్రద్ధవలనగాని లేక ఎరుగనందునగాని) ఆత్మసంబంధమైన ఈ దీవెనలను నీవు పొందలేకపోవచ్చు. ఏదియెలాగున్నా, అశ్చర్యకరమైన సత్యమేమంటే: దేవునికి సమీపస్తులే ఉంటారుగాని, అభిమానులు ఉండరు. క్రీస్తులోనున్న ఒక వ్యక్తి విమోచింపబడినవారికి అనుగ్రహింపబడే దీవెనలు లేకుండా జీవిస్తున్నాడంటే, అది తన సొంత ఎంపికను బట్టి జరుగుతుందేగాని, అట్టి భాగ్యానికి అతడు నోచుకోనివాడైనందున మాత్రం కాదు. క్రీస్తులో ఉండియు ఒక వ్యక్తి ఆత్మసంబంధమైన దరిద్రతలో నిలిచియున్నాడంటే, దేవుడు ప్రసాదించిన కృపాద్వారాలను అతడు సద్వినియోగం చేసికోనివాడయ్యుంటాడు.

సంఘ సమాజము యొక్క పరలోక సంబంధమైన ఎత్తులనుగూర్చి ఆలోచించు. భూమియందంతటను దేవుడు సమానమైన అవకాశాలను ప్రసాదించే ఒకే చోటు యిదే, క్రీస్తులో ఉన్న యితరులతో ఈ సత్యాన్ని ప్రతిబింబింపజేస్తూ వారితో సంబంధం కలిగి జీవించుదాం. ఇతరులను మనము ఎన్నడును పేదరికమును బట్టిగాని, కన్పించే తీరును బట్టిగాని, విద్య లేక దేశమును బట్టిగాని చిన్నచూపు చూడకూడదు. అంతస్థుని బట్టిగాని, అధికారమును బట్టిగాని, ఆధిక్యతలను బట్టిగాని, లేక రూపాన్ని బట్టిగాని మరియొక క్రైస్తవుని ఘనంగా ఎంచకూడదు. మనమందరం ఒక్కటే. ఒకరి కొరకు ఒకరం మరియు ఒకరితో నొకరం కలిసి జీవించుదాం (1 కొరింథీ. 12:27).

## ముగింపు

క్రీస్తు శరీరము సార్వత్రిక సహోదరత్వమైయుంది. అపొ. 15లో యాకోబు చెప్పినట్టు, ఈలాటి సహవాసము ఆమోసు 9:10, 11లో ప్రవచింపబడింది. అపొస్తలులు అన్యజనులకు సువార్తను ప్రకటించడంలో దాని నెరవేర్పును మనం చూస్తాం. ప్రతి

పాపమును తుడిచివేయునంత అడుగు భాగాలకు అది చేరుతుంది. క్రీస్తు ప్రభువు యొక్క రక్త ప్రభావంవలన, ఏ పాపియు దానినుండి మినహాయించబడలేదు. దేశము లన్నిటిని, జనములన్నిటిని చేరగలిగినంత అద్భుతమైన విశాలత దానికుంది. ప్రభువైన యేసు ప్రతి మనుష్యుని కొరకు మరణము రుచి చూచి, రక్షణపొందే అవకాశాన్ని ప్రతి మనుష్యునికి కల్పించాడు (హెబ్రీ. 2:9). క్రీస్తునందున్న కృపామహదైశ్వర్యాన్నిబట్టి, దేవునితోను ప్రతి ఒక్కరితోను ఈ సహవాసము పరలోక సంబంధమైన ఎత్తులకు చేరుతుంది. క్రీస్తులోనికి వచ్చి క్రీస్తునందు జీవించేవారికి ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములన్నీ విస్తరించుతాయి!

సమానత్వము, ఐశ్వర్యభాగ్యాన్ని కలిగించే ఈ పరిధికంటెను ఎక్కువ ఆకర్షణీయమైన దాన్ని నీవు ఆలోచింపగలవా? సమాధానాన్ని గూర్చి లోకం ఎంతగానో మాట్లాడుతూ ఉంటుంది. అయితే లోకంలో నిజమైన సమాధానాన్ని మనం చూడలేం. ఎందువలన? నిజమైన సమాధానమంటే ఏదో అది ఎక్కడ లభిస్తుందో గ్రహించలేకపోయినందున కదా? నిజమైన చిత్త శాంతి – దేవునితో చిత్త శాంతి, ఇతరులతో చిత్త శాంతి, మనతో మనకే చిత్త శాంతి – క్రీస్తు శరీరమైన సంఘమందు మాత్రమే అనుభవించబడుతుంది, ప్రదర్శింపబడుతుంది. క్రీస్తు పూర్వం రమారమి ఏడువందల సంవత్సరాలకు పూర్వము రానున్న సమాధాన రాజ్యాన్ని గూర్చి యెషయా యిలా ప్రవచించాడు:

> తోడేలు గొఱ్ఱెపిల్లయొద్ద వాసముచేయును చిఱుతపులి మేకపిల్లయొద్ద పండుకొనును దూడయు కొదమసింహమును పెంచబడిన కోడెయు కూడుకొనగా బాలుడు వాటిని తోలును. ఆవులు ఎలుగులు కూడి మేయును వాటి పిల్లలు ఒక్క చోటనే పండుకొనును ఎద్దు మేయునట్లు సింహము గడ్డి మేయును. పాలుకుడుచుపిల్ల నాగుపాము పుట్టయొద్ద ఆట్లాడును మిడినాగు పుట్టమీద పాలువిడిచిన పిల్ల తన చెయ్యిచాచును. నా పరిశుద్ధ పర్వతమందంతటను ఏ మృగమును హాని చేయదు నాశముచేయదు. సముద్రము జలములతో నిండియున్నట్టు లోకము యెహోవానుగూర్చిన జ్ఞానముతో నిండియుండును (యెషయా 11:6–9).

క్రీస్తు శరీరంలో మాత్రమే నిలిచియుండే మహిమాయుక్తమైన ఏకత్వాన్ని పర్యాయ భాషలో యెషయా చిత్రించాడు. యెషయాకైతే క్రీస్తు వచ్చి తన రాజ్యాన్ని స్థాపించినప్పుడు నెరవేర్చబడే ప్రవచనం అది, కాని మనకైతే క్రీస్తునందు అనుభవించి ఆనందించే దైనిక జీవితానికి సంబంధించిన లేఖన భాగమైయుంది. తోడేలువంటి గుణము, క్రీస్తుద్వారా హానిలేని పావురమువలె మారి, గొర్రెపిల్లవంటి వ్యక్తిత్వముగలవారితో కలిసి నడవడం కలిసి పని చేయడం నిరంతరంగా మనం చూస్తాం.

క్రీస్తునందు మనము "ఒక్క నూతన పురుషునిగా" చేయబడతాం, ఎందుకంటె క్రీస్తుయొక్క రక్తము ద్వారా దేవునితోనూ, పరస్పర వ్యక్తులతోనూ సహజీవనం కలిగింది. మనం రోజూ వెలుగులో నడిచినందువల్ల ఈ శాంతిని స్థిరంగా పొందుతాం (ఎఫెసీ. 2:15–18; 1 యోహాను 1:7).

క్రీస్తు శరీరము యొక్క సహోదరత్వంలో నీవు భాగమైయున్నావా? అలా కానట్టయితే, నీవు పోగొట్టుకొంటున్న ఔదార్యపు వరములను, బాంధవ్యాలను, కృపనుగూర్చి ఆలోచించు.

"ఏలాగనగా, యూదులమైనను, గ్రీసుదేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క **ఆత్మ**యందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క **ఆత్మ**ను పానము చేసినవారమైతిమి" (1 కొరింథీ. 12:13).

మానవ సహోదరత్వంలో భాగస్వాములైయుంటే చాలదు. దేవుని కుటుంబములో మనం భాగమైయుండి తీరాలి.

## పఠనము మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. అపో. 15 వెనకనున్న తంటా లేక యిబ్బంది ఏమి?
2. రక్షణ సంకల్పానికి యూదయనుండి వచ్చిన క్రైస్తవులు చేర్చిన విషయమేమి?
3. యెరూషలేము ప్రత్యేక కూడికలో ఎవరు మాట్లాడారు, వారు మాట్లాడిందేమి?
4. యెరూషలేము ప్రత్యేక కూడికలో మాట్లాడిన సందేశాలను యాకోబు ఎలా సంక్షిప్తం చేశాడు?
5. యెరూషలేము సమావేశము యొక్క ఉద్దేశమేమి?
6. సువార్త పిలుపునుండి ఎవరు మినహాయించబడ్డారు. వారెందుకు మినహాయించబడ్డారు?
7. 1 కొరింథీ. 6:9-11ను చర్చించు. సువార్త యొక్క విశాలతను గూర్చి ఈ లేఖనం ఏమి తెలుపుతోంది?
8. మనం క్రీస్తులోనికి వచ్చినప్పుడు, దేవుడు మనకు ప్రసాదించు నూతన జీవమును వర్ణించు.
9. మధ్యంతరంగా అంటే సగంవరకు సంఘంలో ఒకడు ప్రవేశించడం నిజమా? నీ జవాబును వివరించు.
10. సువార్త అందరికి - అది యూదులకు అన్యజనులకు కూడా అనేదాన్ని లేఖనాల్లోనుండి నిరూపించు.
11. గలతీ. 3:28ని వివరించు.
12. "ఆత్మసంబంధమైన ఆశీర్వాదములన్నిటికి ఉచిత ప్రవేశము" అంటే అర్థమేమి?
13. ఎఫెసీ. 1:3ను వివరించు.
14. "ఒకడు పుస్తకాలకు సొంతగాడై ఉండవచ్చునుగాని వాటిని సొంతం చేసికోలేడు" అనే ప్రయోగాన్ని చర్చించు. ఈ భావన క్రైస్తవ ఆశీర్వాదములకు ఎలా వర్తించవచ్చు?
15. సమాధానానికి నిజమైన మార్గాన్ని వర్ణించు.